నేడు, రేపు రెవెన్యూ సమావేశాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమ, మంగళవారం రెవెన్యూ సమావేశాలు నిర్వహించనున్నట్లు డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ పాలన మరింత సమర్థవంతంగా ఉండేందుకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన రెవెన్యూ అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం పలాసలో ఆ డివిజన్ రెవెన్యూ అధికారులతో, మంగళవారం టెక్కలిలో ఆ డివిజన్ రెవెన్యూ అధికారులతో సమావేశం జరగనుందని తెలిపారు. వివిధ అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు.

మంచికి వాడుకుందాం



● రణస్థలంలో ఓ యువకుడు కార్లను అద్దెకు తిప్పుతుంటాడు. ఈ క్రమంలో తరచూ విశాఖ, రాజమండ్రి వెళుతుంటాడు. తిరుగు ప్రయాణంలో కారులో ఖాళీగా వస్తున్న క్రమంలో ఎవరైనా సంప్రదించవచ్చు అని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటాడు. దీంతో చాలామంది ఆయనను ఆశ్రయించి ప్రయాసలకు గురికాకుండా వస్తుంటారు. అటు ఆ యువకుడికి సైతం ఉపాధి లభిస్తోంది.

- సోషల్ మీడియాతో ఉపయోగాలెన్నో
- సక్రమంగా వాడుకుంటే మేలు
- లేదంటే దుష్పరిణామాలు తప్పవు
- నేడు ప్రపంచ సోషల్‌మీడియా దినోత్సవం

రణస్థలం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

మానవుడి జీవితంలో సోషల్ మీడియా పెను ప్రభావం చూపుతోంది. ఉదయం లేచింది మొదలు రాత్రికి పడుకునే వరకూ సోషల్ మీడియాను ఎక్కువ మంది వినియోగిస్తున్నారు. సాధారణంగా ఉదయం లేచిన వెంటనే దేవుడి చిత్రపటాలకు దండం పెడుతుంటారు. కానీ, ఇప్పుడు చాలామంది లేవగానే సెల్‌ఫోన్ కోసం తడుముతుంటారు. లేచిన వెంటనే సోషల్‌మీడియాను వీక్షిస్తుంటారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటిని చూసుకుంటారు. సమాచార వ్యాప్తిలో సోషల్ మీడియాది కీలక పాత్ర. ఒక వ్యక్తి జీవితంలో కలిగే బాధ, ఆనందం, విజయం, అపజయం.. ఇలా అన్నిరకాల భావోద్వేగాలను అందరితో పంచుకోవడానికి ఇదో సాధనం. అయితే, సోషల్ మీడియా వినియోగంలో చాలా జాగ్రత్తలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల లాభాలతో పాటు నష్టాలు ఉంటాయంటున్నారు. సోషల్ మీడియా ద్వారా ఎంతో మంది పేరుప్రఖ్యాతలు సంపాదించారు. అదే సోషల్ మీడియా కొందరి జీవితాలను తలకిందులు చేసింది. అందుకే సోషల్ మీడియాలో మీరు ఏంచేస్తారు? ఎలాంటి సమాచారం కోసం వెతుకుతారు? అనేది విశ్లేషించుకోవాలి. మనకు ఉపయోగం అనుకున్న వాటినే ఎంచుకోవాలి. సోమవారం ప్రపంచ సోషల్ మీడియా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

జాగ్రత్తలు పాటించకపోతే నష్టం తప్పదు..

సోషల్ మీడియాను జాగ్రత్తగా వాడుకోకపోతే నష్టం తప్పదు. చాలామంది వ్యక్తిగత జీవితాలపై పోస్టులు పెడుతుంటారు. సమాచారాన్ని (మిగతా 8వ పేజీలో..)

సమాజ సేవలో సతీష్..



పాతపట్నం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పాతపట్నానికి చెందిన సైలాడ సతీష్ సోషల్ మీడియా వేదికగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజామన్ననలు పొందుతున్నారు. దీనికోసం వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. డబ్బులు లేక వైద్యం చేయించుకోలేని వారికి, వ్యాధుల బారిన పడి లేదా ప్రమాదాలకు గురైన వారికి తన గ్రూప్ సభ్యులతో కలిసి ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఎవరికైనా అత్యవసరంగా రక్తం కావాలంటే ఈ ప్రాంతంలో ముందుగా సతీష్‌ను సంప్రదించడం పరిపాటి అయిపోయింది. మొబైల్ బ్లడ్‌బ్యాంక్ (పాతపట్నం బ్లడ్ డోనర్స్ వాట్సాప్ గ్రూప్) ద్వారా రక్తం అందించేందుకు డోనర్లను సిద్ధపరుస్తారు. రెండేళ్లుగా ఉచిత అంబులెన్స్ సేవలు కూడా అందిస్తున్నారు. ఎవరికైనా అంబులెన్స్ అవసరమైతే డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకొని డీజిల్ కొట్టుకొని వాహనాన్ని తీసుకుపోవచ్చు. ఎటువంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరంలేదు. ఇలా సోషల్ మీడియా వేదికగా పలువురి సహాక సహకారాలు అందిస్తూ సతీష్ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

బీటెక్ చదివి.. ఇన్‌ఫ్లుయెన్సర్‌గా ఎదిగి



మహంతి రమణ

శ్రీకాకుళం అర్బన్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రణస్థలానికి చెందిన మహంతి రమణ ఒక పక్క యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా రాణిస్తూ మరోపక్క సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగమవుతున్నారు. బీటెక్ చదివిన రమణ 2020లో సోషల్ 'అరే మావ' పేరిట యూట్యూబ్ చానెల్‌ను ప్రారంబించాడు. సమాజానికి ఉపయోగపడే వీడియోలు తీసి తన యూట్యూబ్ చానెల్‌లో పెడుతున్నాడు. రాజకీయ, సామాజిక కార్యక్రమాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలు, శక్తియాప్, మహిళలకు రక్షణగా ఆటోలకు క్యూఆర్ కోడ్ వంటి కార్యక్రమా లపై వీడియోలను తీసి పోలీస్‌శాఖతో పాటు పలువురి మన్ననలు పొందాడు. ప్రస్తుతం రమణకు 30 లక్షలకు పైచిలుకు సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. 'యూట్యూబ్ చానెల్‌ను పెట్టిన కొత్తలో నేను చాలా మాటలు పడ్డాను. బీటెక్ చదివావు. నీకెందుకురా ఇటువంటివి, ఏదో ఉద్యోగం చేసుకోవచ్చుగా అని చాలా మంది అనేవారు. వాటిని పట్టించుకోకుండా నా పని నేను చేసుకుంటూ పది మందితో యూట్యూబ్ చానెళ్లను నిర్వహించి మంచి పేరు సంపాదించా. రక్త దాన శిబిరాలు కూడా ఏర్పాటు చేశా. అమరావతి వరద బాధితులకు నా యూట్యూబ్ చానెల్ సబ్ స్క్రైబర్ల సాయంతో సేవలు అందించా. గత ఏడా ది ఆగస్టు 25న నా చానెల్ 25 లక్షల మంది సబ్ స్క్రైబర్లకు చేరుకుంది. దీంతో రణస్థలంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించి 220 యూనిట్లను రక్తం సేకరించాం. ఈ కార్యక్రమానికి కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అతిథిగా వచ్చి నన్ను ప్రశంసించడం ఎంతో ఆనందంగా అనిపించింది.' అని రమణ తెలిపారు. ప్రేక్షకులకు సందేశాత్మకమైన విషయాల్లో పరిజ్ఞానం పెంపొందించడమే తన ఆశయమని ఆయన తెలిపారు.

యూట్యూబ్ స్టార్‌గా మత్స్యకార మహిళ..



షూటింగ్‌లో మనవళ్లతో అప్పలమ్మ(ఫైల్)

కవిటి/ ఇచ్ఛాపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 'చిరంజీవి, ప్రభాష్, మహేష్‌బాబు డైలాగులను ఆమె అలవోకగా చెప్పేస్తుంది. అచ్చం సినిమాల మాదిరిగా గన్‌లు పెట్టి ఫైట్లు చేస్తుంది. విలన్లను చితక్కొడుతుంది'.. ఇవన్నీ చేస్తోంది లేడీ సూపర్‌స్టార్ విజయశాంతి అనుకుంటే మీరు పొరబడినట్టే. ఆమె అప్పుబాలు యూట్యూబ్ నటి అప్పలమ్మ. సోషల్ మీడియాలో ఉర్రూతలూగిస్తున్న ఈ బామ్మ వయసు అక్షరాలా 70 సంవత్సరాలు. ఏడు పదుల వయసులో కూడా చలాకీగా యూట్యూబ్‌లో నటించి వేలాది మంది అభిమానులను సొంతం చేసుకుంది. కవిటి మండలం బెజ్జిపుట్టుగ పంచాయతీ పెద్దకర్రివానిపాలెం గ్రామానికి చెందిన మత్స్యకార మహిళ కర్రి అప్పలమ్మ యూట్యూబ్‌లో విశేష ఆదరణ పొందారు. భర్త తెచ్చే చేపలను విక్రయించే అప్పలమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు పూర్తిచేసిన ఆమె ప్రస్తుతం వయోభారంతో ఇంటికే పరిమితం అయ్యారు. అయితే మూడేళ్ల కిందట మనవడు శివ అప్పలమ్మతో తీసిన చిన్నపాటి వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో పెట్టాడు. వాటికి మంచి ఆదరణ లభించింది. దీంతో పెద్ద వీడియోలు, సినిమాల్లో ఫైట్లు, కామెడీ సీన్లను బామ్మ అప్పలమ్మతో తీయడం ప్రారంభించాడు. సొంతంగా అప్పుబాలు యూట్యూబ్ చానల్ ఏర్పాటుచేసి అందులో పెడుతున్నాడు. శివ దర్శకత్వంలో అప్పలమ్మ, పక్కింటి కుర్రాడు బాలుతో పాటు గ్రామంలోని పిల్లలు ఇందులో నటిస్తుంటారు. దీంతో చాలామంది అభిమానులను సొంతం చేసుకుంది అప్పలమ్మ. ఈ వయసులో కూడా ఆసక్తిగా నటిస్తున్న ఆమెను ఎక్కువమంది అభినందిస్తుంటారు. ఈ వయసులో ఇవన్నీ అవసరమా అని చాలామంది ప్రశ్నిస్తుంటారని.. కానీ నటించడమంటే తనకు చాలా ఇష్టమని చెబుతోంది అప్పలమ్మ. రోజురోజుకూ అప్పుబాలు యూట్యూబ్ చానళ్లకు ప్రేక్షకులు, వీక్షకులు పెరిగారు. ఇటీవల లక్ష సబ్‌స్క్రైబర్లను సాధించింది ఈ చానల్. అప్పలమ్మ వల్లే ఆ గ్రామానికి ఎనలేని పేరు వస్తోంది. దీంతో పెద్దకర్రివానిపాలెం గ్రామస్థులు కూడా అప్పలమ్మను చాలా గౌరవంగా చూసుకుంటున్నారు. అప్పలమ్మకు కవిటి మండలంతోపాటు ఇచ్ఛాపురంలో కూడా వందలాది మంది ఫ్యాన్స్ ఉన్నారు. ఆవిడను చూసి చాలా మంది యూట్యూబర్స్‌గా తయారు కావటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

మెళియాపుట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాల



తగ్గిన ఇంటర్ ప్రవేశాలు

- ఈ ఏడాది 18,500 మంది విద్యార్థులే చేరిక
- నేటితో ముగియనున్న గడువు

మెళియాపుట్టి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రవేశాల గడువు సోమవారంతో ముగియనుంది. గత ఏడాది జూలై ఆఖరి వరకూ అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగినా ఈ ఏడాది మాత్రం నెల ముందుగానే నిలిపివేశారు. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్ల సంఖ్య తగ్గింది. జిల్లాలో 186 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో ఈ ఏడాది ఇప్పటి వరకు వివిధ గ్రూపుల్లో 18,500 మంది విద్యార్థులు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది 19,500 మంది జాయినింగ్ అయ్యారు. అంటే ఈ ఏడాది వెయ్యి మంది విద్యార్థులు తగ్గారు. మరో రోజే గడువు ఉండడంతో విద్యార్థుల చేరికపై కళాశాలల యాజమాన్యాల్లో ఆందోళన నెలకొంది. పదో తరగతి పాసైన విద్యార్థుల్లో అధిక శాతం మంది పాలిటెక్నిక్ కోర్సుల వైపు చూస్తున్నారు. దీని ప్రభావం ఇంటర్ అడ్మిషన్లపై పడింది. జూలై 3 నుంచి పాలిటెక్నిక్ సీట్లు కేటాయింపు జరుగుతుంది. ఆ సీట్లు రాని విద్యార్థులు ఇంటర్‌లో చేరే అవకాశం ఉంది. దీనివల్ల కొంత ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంది.

ఒక రోజు గడువు ఉంది..

ఇంటర్‌లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ముందు నుంచే ప్రచారం నిర్వహించాం. ఈ ఏడాది ఇప్పటి వరకు 18,500 మంది విద్యార్థులు ఇంటర్ అడ్మిషన్లు పొందారు. సోమవారం గడువు ఉండడంతో మరికొందరు విద్యార్థులు చేరే అవకాశం ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు ఉచితంగా అందిస్తున్నాం. ప్రభుత్వ కళాశాలలకు విద్యార్థులు వస్తున్నారు.

-దుర్గారావు, ఆర్ఐవో, శ్రీకాకుళం

సాగునీటి కాలువలకు మహర్దశ



జమ్ము జంక్షన్ వద్ద ఎన్టీసీ కాలువలో పూడిక, గుర్రపు డెక్క తొలగించిన దృశ్యం

- 'ఉపాధి' నిధులతో అభివృద్ధి పనులు
- ముమ్మరంగా పూడిక, పిచ్చిమొక్కల తొలగింపు
- తీరనున్న సాగునీటి కష్టాలు
- 2న ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల

నరసన్నపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని సాగునీటి కాలువలకు మహర్దశ పట్టింది. ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. కాలువల్లో పూడిక, పిచ్చిమొక్కల తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో ఈ ఏడాది సాగునీటి కష్టాలు తప్పనున్నాయని శివారు ప్రాంత రైతాంగం ఆనందం వ్యక్తచేస్తోంది. జూలై 2న వంశధార ఎడమ కాలువ ద్వారా సాగునీటిని విడిచిపెట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో పరిస్థితి..

గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఎటువంటి పనులు చేయలేకపోయారు. అయితే, ఈ ఏడాది ముందస్తు ప్రణాళికతో సాగునీటి కాలువలు, చెరువుల్లో పూడికతీత, తుప్పలు తొలగింపునకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పథకం నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. జిల్లాలోని 30 మండలాల్లో 3,389 పనులను గుర్తించి 70శాతం మేరకు చేపట్టారు. త్వరలో మిగతా పనులు కూడా పూర్తికానున్నాయి. అలాగే, దెబ్బతిన్న సూయిజ్‌లు, మదుములను బాగు చేసేందుకు ఎన్ఆర్ఈజీఎస్ కాంపోనెంట్ నిధులతో ఇరిగేషన్ అధికారులు అంచనాలు సిద్ధం చేయగా వాటికి కూడా ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



జలుమూరు మండలం గొటివాడ వద్ద వంశధార పిల్లకాలువ ఇలా..

మెటీరియల్ కాంపోనెంట్ నిధులు రూ.7 కోట్లు..

జిల్లాలో 62 పనులకు గాను రూ.7.01 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయి. ఎల్ఎన్‌పేట, హిరమండలం, నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట, శ్రీకాకుళం, ఆమదాలవలస, గార, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఈ పనులు చేయనున్నారు. నరసన్నపేట వంశధార సబ్ డివిజన్ పరిధిలో 15 పనులకు రూ.3.41 కోట్లు, టెక్కలి సబ్‌డివిజన్ పరిధిలో 25 పనులకు రూ.1.65 కోట్లు, హిరమండలం సబ్ డివిజన్ పరిధిలో 19 పనులకు రూ.1.75 కోట్లు, ఆమదాలవలస సబ్‌డివిజన్ పరిధిలో మూడు పనులకు రూ.19.78 లక్షలు నిధులు వచ్చాయి. మరోక వైపు వంశధార కాలువల్లో ఇతర పనులకు ప్రభుత్వం మరో రూ.6 కోట్లు వరకు మంజూరు చేసింది. దీంతో జిల్లాలోని వంశధార కాలువల్లో పనులు జోరుగా సాగుతున్నాయి. నరసన్నపేట వంశధార సబ్ డివిజన్ పరిధిలో 33 పనులకు రూ.1.30 కోట్లు నిధులు మంజూరు కాగా ఇప్పటికే 22 పనులు పూర్తి చేశారు. ఆపరేషన్ మెయింటెనెస్, నేరేగా (మిగతా 8వ పేజీలో..)

'సీదిరి'పై తిరుగుబాటు






మాజీ స్పీకర్ సీతారాంతో సమావేశమైన వైసీపీ సీనియర్ నాయకులు (ఫైల్)

- ఏకమవుతున్న వైసీపీ సీనియర్లు
- మాజీ మంత్రికి చెక్ పెట్టేందుకు వ్యూహం
- ఆయనకు సీటు ఇవ్వకుండా చేయడమే అజెండా
- మాజీ స్పీకర్ తమ్మినేనిని కలిసిన వైనం
- త్వరలో పార్టీ మాజీ ఎమ్మెల్యేలను కలిసేందుకు సన్నద్ధం

పలాస, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పలాస నియోజకవర్గంలో తనకు ఎదురులేదు. ఏ ఎన్నికలు వచ్చినా తనకే సీటు, తనదే గెలుపు అంటూ విర్రవీగుతున్న మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి సీదిరి అప్పలరాజుపై ఆ పార్టీ సీనియర్ నాయకులు తిరుగుబావుటా ఎగురవేశారు. వారంతా ఏకమై ఆయనకు చెక్ పెట్టేందుకు వ్యూహం పన్నుతున్నారు. 2019 ఎన్నికల్లో అప్పలరాజు విజయం కోసం ఆయన అనుచరులు అహర్నిశలు శ్రమించారు. ఆ ఎన్నికల్లో వైసీపీ కూడా అధికారంలోకి రావడంతో వారు ఎంతో సంబరపడిపోయారు. తమకు తగిన ఫలితం, గుర్తింపు వస్తుందని భావించారు. కానీ, కథ అడ్డం తిరిగింది. తమకు తగిన స్థానం లభించడం లేదని, కొత్తవారికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ అప్పలరాజుపై సీనియర్లు గుర్రుగా ఉండేవారు. ఆయన కూడా తగు రీతిలో స్పందించకపోవడంతో వారి మధ్య విబేధాలు పొడచూపాయి. 2024 ఎన్నికల తరువాత పరిస్థితి తారుమారైంది. రాష్ట్రంలో కూటమి అఖండ విజయం సాధించడం, ఎన్నడూ లేని విధంగా పలాస నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషకు 41 వేల పైచిలుకు మెజార్టీ రావడంతో వైసీపీ నామరూపాలు లేకుండా తుడిచిపెట్టుకుపోయింది. అయినా ఇప్పటికీ అప్పలరాజు సీనియర్లను పట్టించుకోకపోవడం, కనీసం పార్టీ కార్యక్రమాలకు కూడా ఆహ్వానించకపోవడంతో వారంతా ఏకమవుతున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్, సీనియర్ నాయకుడు మరడ భాస్కరరావుతో పాటు పట్టణానికి చెందిన ఒక ప్రముఖ వైద్యుడు తదితరులు కలిసి ఈ నెల 27న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిశారు. వారు తమకు జరిగిన అన్యాయాన్ని ఆయన వద్ద ఏకరువు పెట్టినట్లు సమాచారం. అప్పలరాజుకు మళ్లీ టిక్కెట్ ఇస్తే గెలిచే పరిస్థితి లేదని, ఇప్పటి నుంచి నాయకత్వం మార్పిడి చేసి నాలుగేళ్లలో పార్టీని బలోపేతం చేస్తేనే తప్పా పరిస్థితి కుదుటపడదని చెప్పినట్లు తెలుస్తోంది. సీతారాం కూడా జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేయడానికి అంతా కలిసి పనిచేయాలని అని చెప్పినట్లు సమాచారం. మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌తో పాటు జిల్లాలోని వైసీపీ మాజీ ఎమ్మెల్యేలందరినీ కలిసి పలాస నియోజకవర్గంలో అభ్యర్థి మార్పే ప్రధాన అజెండాగా సీనియర్లు వ్యూహం రచిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా 2019 నుంచి 2024 వరకూ అప్పలరాజుతో విబేధించిన వారి వివరాలు మొత్తం సేకరించి, అందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాలు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటిలో మొత్తం 25 మంది వరకూ గుర్తించి వారికి వర్తమానం పంపించారు. తొందరలోనే వారితో ముందుగా సమావేశమై వారి అభిప్రాయాల మేరకు కార్యాచరణ నిర్ణయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే నాలుగేళ్లలో మొత్తం నియోజకవర్గమంతా కలియతిరిగి తమకు జరిగిన అన్యాయం, టిక్కెట్ ఎందుకు మార్చకూడదు అనే అజెండాతో వైసీపీ ముఖ్య కార్యకర్తల వద్దకు వెళ్లడానికి వారు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో ఒకరు నియోజకవర్గ పాదయాత్రకు శ్రీకారం చుట్టి తేదీని కూడా ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబును 'ఆంధ్రజ్యోతి' ప్రశ్నించగా.. 'మేము మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను కలిసింది వాస్తవమే. మా మధ్య ఎలాంటి రాజకీయ చర్చ జరగలేదు. వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించడానికి కష్టపడాలని సీతారాం సూచించారు.' అని తెలిపారు.

శంకరాభరణం శంకరశాస్త్రి
సిక్కోలు వాసే!

- 'కన్యాశుల్కం'లో రామప్ప పంతులుగా గుర్తింపు
- రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం
- నేడు జేవీ సోమయాజులు జయంతి

7లో

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి
- మృతదేహంతో రోడ్డుపై గ్రామస్థుల నిరసన
- నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం

8లో


రెండు పర్యాయాలు శంకుస్థాపన చేసినా..!
● అర్ధంతరంగా నిలిచిన పనులు ● దారుణంగా శివరాంపురం రోడ్డు

8లో

చినుకుపడితే నరకమే
● ఇదీ అంజనాపురం రోడ్డు పరిస్థితి ● ప్రజలకు తప్పని ఇబ్బందులు

8లో

తెలంగాణ పీజీఈసెట్‌లో
సిక్కోలు విద్యార్థినికి స్టేట్‌ఫస్ట్

7లో

శంకరాభరణం శంకరశాస్త్రి సిక్కోలు వాసే!



- 'కన్యాశుల్కం'లో రామప్ప పంతులుగా గుర్తింపు
- రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం
- నేడు జేవీ సోమయాజులు జయంతి

ఎచ్చెర్ల, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కళాకారుడు కడవరకూ కళాకా రుడేనని నిరూపించారు ఆ యన. నాటక, టీవీ, సిని మా రంగాలలో ఎనలేని కీర్తిని ఆర్జించిన ఆయన కళామ తల్లి ముద్దుబిడ్డ అనిపించుకు న్నారు. రెవెన్యూ శాఖలో కీలక బాధ్యతలు నిర్వ ర్తిస్తూనే.. తనకు కళామ తల్లిపై ఉన్న మమకారాన్ని చాటుకున్నారు. ఉద్యోగ రీత్యా ఎంత బిజీగా ఉన్నప్పటికీ, తనకు కళారంగంపై ఉన్న జిజ్ఞాసను ఏనాడూ వీడలేదు. ఆయన ఎవరో కాదు శంకరాభరణం శంకరశాస్త్రిగా తెలుగు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన జొన్నల గడ్డ వెంకట సోమయాజులు. 1979లో విడుదలైన శంకరాభర ణంలో శంకరశాస్త్రిగా నటించి తెలుగు సినిమా తెరపై పేరొందిన సోమయాజులు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు సమీపంలోని లుకలాం అగ్రహారం గ్రామంలో 1928 జూన్ 30న వెంకట శివరావు, శారదాంబ దంపతులకు జన్మించారు. విజయనగరంలో చదువుకున్న రోజుల నుంచి సోమయాజులు నాటకాల్లో నటించడం మొదలుపెట్టారు.

రారా కృష్ణయ్యతో వెండితెరపై..

నాటక రంగంపై అపార అనుభవం ఉన్న జేవీ సోమయాజులు రారా కృష్ణయ్య సినిమాలో 1979 తొలిసారిగా వెండి తెరపై కనిపించారు. ఆ తర్వాత 1979లో కె.విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందించిన శంకరాభరణం సినిమాలో శంకరశాస్త్రిగా సోమయాజులు అద్భుతంగా నటించి పేరుతెచ్చుకు న్నారు. శంకరాభరణం సినిమాలోని పాటలు ఎప్పుడు విన్నా వీనులవిందుగా ఉంటాయి. ఆ తర్వాత బాపు దర్శకత్వంలో వంశవృక్షం, త్యాగయ్య చిత్రాల్లో నటించారు. త్యాగ య్య సినిమా పెద్దగా హిట్ కాకపోయినా, సోమయాజులుకు నటుడిగా గుర్తింపు తీసుకువచ్చింది. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో 150 చిత్రాల్లో నటించారు.

కన్యాశుల్కం నాటకంతో..

సోమయాజులు తన తమ్ముడు రమణమూర్తితో కలిసి మహా కవి గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకంలో నటిం చి పేరు సాధించారు. రమణమూర్తి గిరీశంగా, సోమయాజులు రామప్పపంతులుగా నటించి నభూతో నభవిష్యతి అనిపించారు. 45 ఏళ్లలో 500 సార్లు కన్యాశుల్కం నాటకాన్ని నటించి రంజిం పజేశారు. 1953 ఏప్రిల్ 20వ తేదీన తొలిసారిగా కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించారు. రామప్పపంతులుగా ధీర గంభీర స్వ రంతో సోమయాజులు అలరించారు. తొలుత వేదుల జగన్నాథం ప్రోత్సాహంతో నాటకాల్లో నటించారు. అంతకుమునుపు 1946 నుంచి పెళ్లి పిచ్చి, దొంటాకం నాటకాల ప్రదర్శనతో గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే నటనలో మరింత పదను పెట్టుకోవాలనే సంకల్పంతో మనిషిలో మనిషి, నాటకం, పంజరం, గాలివాన, కప్పలు నాటకాల్లో నటించారు. టెలివిజన్‌లో ప్రసారం కోసం కన్యాశుల్కాన్ని 13 భాగాల నాటకంగా రూపొందించారు. జంట నగరాల్లో నాటక కళ ప్రోత్సాహానికి రసరంజని అనే సంస్థను గరిమెళ్ల రామ్మూర్తి, చాట్ల శ్రీరాములు, రాళ్లపల్లి వంటివారితో కలిసి స్థాపించారు.

డిప్యూటీ కలెక్టర్‌గా..

రెవెన్యూ శాఖలో అంచెలంచెలుగా ఎ దుగుతూ డిప్యూటీ కలెక్టర్ స్థాయికి ఎ దిగారు సోమయాజులు. మహబూబ్‌నగర్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమ యంలోనే ఆయనకు శంకరాభ రణంలో నటించే అవకాశం వచ్చిం ది. శంకరాభరణం సినిమాకు ముందు ఆయన యోగి దర్శకత్వంలో రారా కృష్ణయ్య సినిమాలో ముఖ్యపాత్రలో నటించారు. ఇది మంచి చిత్రమైనప్పటికీ ఆర్థికంగా విజయవంతం కాకపోవడంతో ఈ సి నిమా గురించి పెద్దగా చెప్పుకోలేదు. ప్రభుత్వ అనుమతి లేకుం డా సినిమాల్లో నటిస్తున్నారని ఆనాటి ముఖ్యమంత్రి మర్రిచెన్నా రెడ్డికి ఫిర్యాదులు అందడంతో ఆయన పరిశీలించి, కొత్తగా సాం స్కృతిక శాఖను ఏర్పరచి ఆ శాఖకు తొలి డైరెక్టర్‌గా నియ మించారు. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 55 తగ్గించడంతో ఆ ప్రభావం సోమయాజులుపై కూడా పడింది. దీంతో ఈయన సాంస్కృతిక డైరెక్టర్ హోదాలో పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో కళలశాఖకు అధిపతిగా నియమితులయ్యారు.

2004లో మరణం..

తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో శంకరభరణం శంకరశాస్త్రిగా పేరొందిన జేవీ సోమయాజులు 2004, ఏప్రిల్ 24న కళామతల్లి సేవకు సెలవు అంటూ శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. రంగస్థలం, వెండితెర, బుల్లితెరలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న సోమయాజులు సిక్కోలు గెడ్డపై జన్మించి ఈ ప్రాంతానికే పేరు తీసుకురావడం మనందరికి గర్వకారణంగా చెప్పుకోవచ్చు.

మంత్రి లోకేశ్‌తో అచ్చెన్న మాటామంతీ

శ్రీకాకుళం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఏడాది పాలనపై పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో వివిధ అంశాలపై వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చర్చించారు. ఏడాది పాల నపై ఇరువురి మధ్య ఆసక్తికర సంభాషణ కొనసాగింది. శ్రీకాకుళం జిల్లా స్థితిగతులపై చర్చించుకున్నారు. అలాగే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మంత్రి లోకేశ్‌ను కలుసుకున్నారు.



లోకేశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

గిరిజన ప్రాంతాల్లో 'రేషన్' ఇబ్బందులు

- ముఖ్యమంత్రికి విన్నవించిన ఎమ్మెల్యే గోవిందరావు



సీఎంకు సమస్య వివరిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

శ్రీకాకుళం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో రేషన్ ఇబ్బం దులున్నాయని ముఖ్య మంత్రి చంద్రబాబుకి పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు విన్నవించారు. అమ రావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివా రం విస్తృత స్థాయి స మావేశం నిర్వహించారు. సమస్యలేమైనా ఉన్నా యా? అని సీఎం ఎమ్మెల్యేలను ప్రశ్నించారు. దీనిపై పాతపట్నం ఎమ్మెల్యే నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. 'గిరిజన ప్రాంతాల్లో రెండు మూడు గ్రామాలకు కలిపి ఒక రేషన్ దుకాణం ఉంటుంది. దీనివల్ల ఆయా ప్రాంత గిరిజనులు సుమారు నాలుగు కిలోమీటర్లు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చు కుంటున్నారు. గిరిజనులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి' అని విన్నవించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిం చారు. గుడ్ క్వశ్చన్ అంటూ కొనియాడి.. గిరిజన ప్రాంతాల్లో రేషన్ పంపిణీ కోసం మొబైల్ వ్యాన్లను ఏర్పాటు చేద్దామని.. రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ నిర్ణయం త్వరలో తీసుకుంటామని వెల్లడించారు.

తెలంగాణ పీజీఈసెట్‌లో సిక్కోలు విద్యార్థినికి స్టేట్‌ఫస్ట్



తనూజనాయుడు

అరసవల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పీజీఈసెట్ ఫలితాల్లో సిక్కోలు విద్యార్థిని స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం మండలం, కనుగులవానిపేట గ్రామానికి చెందిన ఇప్పిలి త నూజనాయుడు తెలంగాణ పీజీ ఈసెట్‌లో బయోటెక్నాలజీ వి భాగంలో ప్రతిభ చూపింది. ఆంధ్రా యూ నివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తిచేసి, హైద రాబాదులోని ఓ ప్రైవేట్ కంపె నీలో క్వాలిటీ కంట్రోల్ విభా గంలో పనిచేస్తుంది. తనూజ ర్యాంకు సాధించడంపై కుటుం బసభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి దంపతులు ఆమెను అభినందించారు. కాగా తనూజనాయుడు తల్లిదం డ్రులు ఇప్పిలి శివ వ్యవ సాయదారుడు, తల్లి వెంకట లక్ష్మి గృహిణి.

జనసేన పార్టీ జెండా తొలగింపు



పార్టీ జెండాను తొలగించిన దృశ్యం

బూర్జ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పెదలంకాం గ్రామంలో ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండా ను గుర్తుతెలియని దుండగులు శనివారం రాత్రి తొలగించారు. గతేడాది జనసేన పార్టీ నాయకులు ఈ గ్రామంలో జెండా ఆవిష్కరించా రు. పార్టీకి వస్తున్న ఆదరణ చూడలేక గతంలో దుండగులు ఈ జెండాను తొలగించగా.. ఇప్పుడు ఏకంగా పైపుతోనే జెండాను తొలగించారు. దీంతో ఆ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆదిత్యుని ఆదాయం రూ.5.20లక్షలు

అరసవల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.5,20,754 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.2,66,100, విరాళాల ద్వారా రూ.71,264, ప్రసాదాల ద్వారా రూ.1,83,390 ఆదాయం లభించిందని ఆలయ ఆవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం వర్షం కారణంగా సాధారణ సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

శ్రీకాకుళం క్రైమ్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాల కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం రౌడీషీటర్లు, నేరచరిత్ర గలిగినవారిని అదుపులోకి తీసుకుని పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, టెక్కలి, పాతపట్నం, లావేరు, కొత్తూరు తదితర స్టేషన్లకు రౌడీషీటర్లను, పాతనేరస్థులను తీసుకువచ్చి.. చట్టవ్యతిరేకంగా కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇప్పటికైనా సత్ప్రవర్తనతో మెలగాలని.. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ఉపాధ్యాయుల నుంచే ఉద్యమాలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉద్యమాలు ఉపాధ్యా యుల నుంచే పుట్టినవని, ఉపాధ్యాయులు సామాజిక శ్రేయస్సు కోరేలా ఉద్యమాలు చేస్తారని ఏపీటీఎఫ్ అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్ అన్నారు. ఆదివారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో రచయిత కంచరాన భుజంగరావు రచించిన 'గేసి చెరిపే బొమ్మ' పుస్తకాన్ని ఆవిష్కరణ, మరో రచయిత దివి కుమార్ రచించిన 'ఉరికంభం సాక్షిగా' పుస్తకం పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యా యుల్లో ఉన్న రచయితలు సమాజానికి ఉపయోగపడే పుస్తకాలను రచిస్తారన్నారు. డీఈవో తిరుమల చైతన్య మాట్లాడుతూ.. శబ్దం అర్థం కలిస్తే సాహిత్యం అవుతుంది అని అన్నారు. బోధనలో ఉపాధ్యాయుడు తాత్వికుడుగా ఎదరగాలన్నారు. యూటీఎఫ్ నాయకులు అనిల్‌కుమార్, చిగురుపల్లి ప్రభాకరరావు, కె.భానుమూర్తి, దవళ సరస్వతి, రచయిత గంట్యాడ గౌరునాయుడు, జన సాహితి జిల్లా కార్యదర్శి పి.మోహన్‌రావు, ఉపాధ్యాయులు చావలి శ్రీనివాస్, సదాశివుని శంకరరావు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయండి

అరసవల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కులు కాలరాసే లేబ ర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతన రూ.26 వేలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అమ్మన్నాయుడు, పి.తే జేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో సీఐటీయూ జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. వచ్చే నెల 9న చేపట్టనున్న సమ్మెలో కార్మికులు, స్కీంవర్కర్లు పా ల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా నాయకులు అల్లు సత్య నారాయణ, హనుమంతు ఈశ్వరరావు, ఎం.ఆదినారాయణమూర్తి, అంగ న్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పార్స్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పీసీ మహాల్‌నోబిస్ జయంతి



మహాల్ నోబిస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

అరసవల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రణాళిక రచన ఫలితాల అంచ నా, అభివృద్ధి సూచికలు తయారీలో పీసీ మహాల్ నోబిస్ శాస్త్రీయంగా గణాంకాలు రూపకల్పన చేసిన మహోన్నత వ్యక్తి అని ముఖ్యప్రణాళికా ధికారి వీఎస్ఎస్ లక్ష్మీప్రసన్న అన్నారు. శ్రీకాకుళం సీపీవో కార్యాలయం లో ప్రశాంత చంద్ర మహాల్‌నోబిస్ (పీసీ మహాల్ నోబిస్) జయంతి సంద ర్భంగా జాతీయ గణాంకాల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బి.సుధాకరరావు, అపెస్సా గణాంక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

పొందూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లోని దుకాణాలు, ఖాళీ భవనాలను ఆదివారం పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ముమ్మరంగా తనిఖీ చేశారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు తరచూ తనికీలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది, శ్రీకాకుళం డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు..

ఆమె నేత్రాలు సజీవం



లక్ష్మీ (ఫైల్)

అరసవల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగరంలో పీఎన్ కాలనీకు చెందిన ఆర్.లక్ష్మీ (86) ఆదివా రం మృతిచెందింది. ఆమె కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. రెడ్‌క్రాస్ పర్యవేక్షణలో మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం సిబ్బం ది కార్నియాను సేకరించి విశాఖపట్నంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల పంపించారు. ఆమె కుటుంబ సభ్యులను రెడ్ క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు తదితరులు అభినందించారు.

బలహీనపరిచే చర్యలు విడనాడాలి

శ్రీకాకుళం అర్బన్/ అరసవల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీని బ లహీనపరిచే చర్యలు కేంద్ర ప్రభుత్వం విడనాడాలని విశాఖ డివిజన్ ఇ న్సూరెన్స్ రిటైర్డు ఉద్యోగుల సంఘ ప్రధాన కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఒక ప్రైవేటు హోటల్‌లో సంఘ సమావే శం నిర్వహించారు. ఎల్‌ఐసీలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రతిపాదన దేశ పాలసీదారుల ప్రయోజనాలను దెబ్బతీసుందన్నారు. వచ్చే నెల 9న జరిగే సమ్మెకు ఎల్‌ఐసీ పెన్షర్లు మద్దతుగా నిలుస్తారన్నారు. కార్యక్రమం లో సంఘ నాయకులు ఎస్.రవిశేఖర్, కె.నారాయణ, ఎం.ఆదినారాయణ మూర్తి, బీపీసీకే మోహన్‌రాజు, శివాజీ, సత్యనారాయణ, ఎంవీ కామేశ్వ రరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు బలోపేతం చేయాలి

అరసవల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలల బలోపేతాని కి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.శ్రీనివా స్ కోరారు. ఆదివారం స్థానిక దాసరి క్రాంతి భవన్‌లో ఎస్టీయూ నాయ కుల జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే తమ లక్ష్యం అంటూ, కార్పొరేట్ పాఠశాలలకు తల్లికి వందనం పథకం అమలు చే యడం సరికాదన్నారు. 11వ వేతన సవరణ గడువు ముగిసి రెండుళ్లైనా 12వ వేతన సవరణ ఊసే లేదని, అసలు పీఆర్సీ ఎప్పుడు ఇస్తారో చెప్పా లని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జి.రమణ, మన్యం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి పి.రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



శ్రీకాకుళం కల్చరల్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇలిసిపురంలోని జగన్నాథస్వామి ఆలయంలో ఆది వారం స్వామివారి కూర్మావతా రంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అదేవిధంగా మొండేటివారి వీధి, గుజరాతీపేటలో ఆలయాల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలం కరించి పూజలు చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా స్వామివారు వివిధ రూపాల్లో దర్శనమించారు.

అందని బిల్లులు.. ముందుకు సాగని పనులు

సరుబుజ్జిలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించినా తమ బిల్లులు అధికారులు మంజూరు చేయలేదని చిగురువలస పంచాయతీ బిక్కిరి పేట గిరిజనులు ఆదివారం తెలిపారు. అధికారులు చెప్పిన విధంగా స్టే జీల వారీగా ఇంటి నిర్మాణం చేపట్టామని, ఇంతవరకు తమ ఖాతాలకు పైసా బిల్లులు జమకాలేదని లబ్ధిదారులు సవర వినోత్, విస్తారాణి, చిన్నారావు, మయాతి, జెనియా, మార్తా, వినోస్, మేరీరత్నాలు, మౌనిక వాపోయారు. అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేశామని, బ్యాంక్‌కు వెళ్లిచూస్తే పైసా జమకాలేదని వెల్లడించారు. అధికారులు స్పందించి ఇంటి బిల్లులను మంజూరు చేయాలని కోరుతున్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా

ఇచ్ఛాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి పురుషోత్తం కుమారుడు గత కొంత కాలంగా హైడ్రో సేఫలస్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న 2001-02లో టెన్త్ చదువుకున్న తోటి స్నేహితులు రూ.37500 సాయం చేశారు. సుమారుగా 25 ఏళ్ల తర్వాత తోటి స్నేహితులు ఇంటికి వచ్చి సాయం అందించడంతో పురుషోత్తం కన్నీరు పెట్టుకున్నాడు.

రెండు పర్యాయాలు శంకుస్థాపన చేసినా..

- అర్ధంతరంగా నిలిచిన పనులు
- దారుణంగా శివరాంపురం రోడ్డు


రాళ్లు తేలి దారుణంగా ఉన్న శివరాంపురం రోడ్డు (ఇన్‌సెట్‌లో) వైసీపీ హయాంలో వేసిన రెండు శిలాఫలకాలు

వజ్రపుకొత్తూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గల్లీ జంక్షన్ నుంచి శివరాంపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణం హాస్యాస్పదంగా తయారైంది. రోడ్డు నిర్మాణానికి వైసీపీ హయాంలో రెండు పర్యాయాలు అప్పటి మంత్రి డా. సీదిరి అప్పలరాజు శంకుస్థాపనలు చేశారు. అయితే నేటికీ అలాగే ఉండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డంతా రాళ్లు తేలడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయితే శివరాంపురంతో పాటు చుట్టుపక్కల గ్రావల ప్రజల రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని వారు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ దిశగా స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ డీఈ రామకృష్ణ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా రోడ్డు నిర్మాణంలో నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచి పోయాయి. కొత్త జీవోతో త్వరలో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

అధ్వానంగా ప్రధాన రహదారి


దారుణంగా ఉన్న పిన్నింటిపేట ప్రధాన రహదారి

పోలాకి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రహదారి విస్తరణ చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రోడ్డు మధ్య నుంచి ఒకపక్క సీసీ రోడ్డు నిర్మించారు. మరో పక్క పనులు చేపట్టలేదు. ఈలోగా వర్షాలు కురవడంతో రోడ్డంతా దారుణం గా తయారైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదీ పిన్నింటిపేట ప్రధాన రోడ్డు తీరు.. వర్షం కురవడంతో గోతుల్లో నీరు చేరి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ట్రాక్టర్లు, ఆటోలు, మినీ బస్‌లు, ద్విచక్ర వాహనాలు తిరగడం వల్ల రోడ్డు దారుణంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, ఈలోగా ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చినుకుపడితే నరకమే..


దారుణంగా ఉన్న అంజనాపురం రోడ్డు

టెక్కలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం ఏ మారుమూల ప్రాంతమో అనుకునేరు.. కానేకాదు. మేజర్ పంచాయతీ టెక్కలి 20వ వార్డు అంజనాపురం రోడ్డు.. ఏమాత్రం చిన్నపాటి వర్షం కురిసినా ఇలా దారుణంగా తయారై బాటసారులు సైతం నడిచేందుకు అవకాశం లేకుండా పోతోంది. వాహనాలు సైతం బురద వల్ల అదుపు తప్పి వాహనదారులు గాయపడుతున్నారు. జాతీయ రహదారి ఆదీఆంధ్రా వీధి జంక్షన్ నుంచి అంజనాపురం వరకు రోడ్డు పనులకు సంబంధించి బెర్మ్‌లు వేసి వదిలేయడంతో ఇటువంటి పరిస్థితి నెలకొంటోంది. ఈ మార్గంలో చిన్నకేదారి, సవరగోపాలపురం, నువ్వుగుడ్డి గ్రామాల గిరిజనులతో పాటు అంజనాపురం గ్రామస్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అధికార లాంఛనాలతో సీఐఎస్‌ఎఫ్ జవాన్ అంత్యక్రియలు

- స్వగ్రామంతో పాటు ఎచ్చెర్లవానిపేటలో విషాదఛాయలు



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న పోలీసు అధికారులు (ఇన్‌సెట్‌లో) రాజగోపాలరావు (ఫైల్)

జలుమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ వాన రాజగోపాలరావు (37) మృతదేహానికి స్వగ్రామంలో ఆదివారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌లో శుక్రవారం సాయంత్రం గుండెపోటుకు గురై మృతిచెందారు. 12 ఏళ్లుగా ఆయన సీఐఎస్ఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉండే రాజగోపాలరావు అకస్మాత్తుగా మృతిచెందడంతో గ్రామస్థులు జీర్ణించుకోలేకపోతున్నారు. రాయచూర్ నుంచి స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకువచ్చి పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. మృతుడి తండ్రి ఆదినారాయణ 7 ఏళ్ల క్రితం మృతి చెందగా రాజగోపాలరావే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి తల్లి శకుంతల, భార్య మీనాక్షి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజగోపాలరావు మృతితో స్వగ్రామం రామచంద్రాపురం, అత్తవారి గ్రామం ఎచ్చెర్ల వానిపేటల్లో విషాదఛాయలు అలముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే రాజగోపా లరావు మృతి చెందిన విషయం తలుసుకుని గ్రామస్థులు జీర్ణించుకోలేక పోతున్నారు. కుటుంబ పెద్ద మృతితో బంధువులు లబోదిబోమంటున్నారు.

తుప్పల్లో మృతదేహం లభ్యం

హిరమండలం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోలిపి గిరిజన గ్రామ సమీపంలో కుళ్లిపోయిన మృతదేహం శనివారం బయటపడింది. ఎస్ఐ ఎండీ యాసిన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సోలిపి గ్రామానికి చెందిన పాలక దండాసి(55) ఒంటరిగా జీవిస్తుండేవాడు. గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసై ఇంటిలో ఉండకుండా ఎక్కడెక్కడో తిరుగుతుండేవాడు. ఎవరైనా ఆహారం పెండి తినేవాడు. లేదంటే తిండిలేకుండానే ఉండేవాడు. దీంతో అనారోగ్యానికి గురై కొద్ది రోజుల కిందట మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. శనివారం గ్రామానికి చెందిన కొందరు తుప్పల్లో ఉన్న కుళ్లిన మృతదేహాన్ని గుర్తించి మృతుడి సోదరి హిమరిక కాంతమ్మకు సమాచారం ఇచ్చారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

నరసన్నపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తామరాపల్లి శివారు ప్రాంతంలోని తోటల్లో పేకాట శిబిరాలపై ఆదివారం నరసన్నపేట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో పేకాట ఆడుతున్న 12 మందిని పట్టుకుని వారి నుంచి రూ.71,040 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. రాళ్లగోదాలవలస, జిల్లేడివలస, తామరాపల్లి, నరసన్నపేటకు చెందిన యువకులు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు.

వ్యక్తి ఆత్మహత్య


తిరుపతి (ఫైల్)

పలాస, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఉదయపురం గ్రామానికి చెందిన రాయల తిరుపతి(49) శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు కాశీబుగ్గ ఏఎస్ఐ ప్రకాశరావు తెలిపారు. కాశీబుగ్గ పోలీసుల కథనం మేరకు.. తిరుపతి వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవ నం సాగించేవాడు. మద్యం అలవాటు ఉండడంతో అప్పుడప్పుడు కడుపు నొప్పితో బాధపడేవాడు. శనివారం రాత్రి పూటుగా తాగి ఇంటి సమీపంలోని మండపం మీద నిద్రపోయాడు. ఉదయం ఇంటికి రాక పోయే సరికి మండపం వద్దకు కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. ఈ విషయమై కాశీబుగ్గ పోలీసులకు ఆదివారం కుటుంబ సభ్యులు సమా చారం ఇవ్వగా వారు ఘటనా ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగినట్లు సమాచారం. మృతుడికి భార్య శాంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకాశరావు తెలిపారు.

బోల్తాపడిన లారీ.. తప్పిన ప్రమాదం


బోల్తాపడిన లారీని తీస్తున్న దృశ్యం

పొందూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వావిలపల్లిపేట కూడలి వద్ద ఆదివారం ఓ లారీ బోల్తాపడింది. ఈ సమయంలో ఎవరూ లేకపోవడం, ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఒడిశాకు చెందిన ఊకలారీ ఆదివారం మధ్యాహ్నం రాజాం నుంచి వస్తుండగా వావిలపల్లిపేట మలుపు వద్ద వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీ సిబ్బంది ఎవరూ గాయపడకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. బోల్తాపడిన లారీని రెండు క్రేన్ల సాయంతో సరిచేశారు.

నిర్లక్ష్యం..


నివగాం-మాతల బ్రిడ్జి వద్ద విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగెలు

కొత్తూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నివగాం-మాతల బ్రిడ్జి వద్ద మాతల వైపు వెళ్లే 33కేవీ విద్యుత్ లైన్ స్తంభానికి తీగెలు అల్లుకుని ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. విద్యుత్ స్తంభాన్ని, వైర్లను అల్లుకుని ఉండడంతో వర్షాలు పడి గాలు సంభవించిన విద్యుత్ వైర్లు కలిసి మంటలు వ్యాపిస్తున్నాయని, ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

- మృతదేహంతో రోడ్డుపై గ్రామస్థుల నిరసన
- నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో) ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటఅప్పారావు, సీఐ తిరుపతిరావు

వజ్రపుకొత్తూరు/ నందిగాం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బెండిగేటు సమీపంలో బాబా గుడి వద్ద శనివారం రాత్రి ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో కొండవూరుకు చెందిన కొరికాన చైతన్య (29) మృతి చెందగా.. అతని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గ్రామస్థులు మృతదేహంతో రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. డీఎస్పీ వెంకట అప్పారావు ఆందోళనకారులతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. వివరాలిలా ఉన్నాయి.. రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం కవిటి అగ్రహారానికి చెందిన పిట్ట అర్జునరావుకు చెందిన ట్రాక్టర్ ఢీకొని చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ ఘటనపై ట్రాక్టర్ యజమాని అర్జునరావు తగిన విధంగా స్పందించకపోవడంతో కొండవూరు గ్రామస్థులు ఆందోళనకు దిగారు. అయినా ట్రాక్టర్ యజమాని స్పందన లేకపోవడంతో ధర్నాను ఉధృతం చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని నినదిస్తూ వాహనాల రాకపోకలకు నిలుపుదల చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. న్యాయం జరిగే వరకు ధర్నా విరమించేది లేదని వారు స్పష్టం చేశారు. కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు ఆందోళనకారులతో సంప్రదించి ధర్నా విరమించాలని కోరారు. అప్పటికే రోడ్డుపై ఉన్న మహిళలు, యువకులు అంగీకరించలేదు. దీంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. మృతదేహంతో రోడ్డుపై ఇన్ని గంటల పాటు ధర్నా చేయడం సరికాదన్నారు. ట్రాక్టర్ యజ మానితో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నందిగాం ఎస్ఐ షేక్‌మహమ్మద్ ఆలీ వజ్రపుకొత్తూరు, నందిగాం పోలీసులు పాల్గొన్నారు.

మొదట గుర్తు తెలియని వాహనంగా గుర్తింపు

శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చైతన్యకు ఢీకొట్టిన వాహనాన్ని మొదట గుర్తుతెలియని వాహనంగా నమోదు చేశారు. తరువాత కొండవూరు యువత సమాచారం సేకరించడంతో సదరు ట్రాక్టర్ పిట్ట అర్జునరావుదని, ఆ వాహనం ఢీ కొనడం వల్లే చైతన్య మృతి చెందినట్లు గుర్తించారు. ప్రమాద సమయంలో పిట్ట కామేష్ ట్రాక్టర్ డ్రైవింగ్ చేసినట్లు గుర్తించారు. అయితే ఆదివారం పలాస ఆసుపత్రిలో చైతన్య మృతదేహానికి పోస్టుమార్టం సమయంలో వచ్చిన ట్రాక్టర్ యజమాని అర్జునరావు కొండవూరు పెద్దలతో మాట్లాడి చైతన్య కుటుంబాన్ని ఆదుకుంటామని మొదట హామీ ఇచ్చి ఆ తరువాత కనిపించక పోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వద్దకు వందలాది మంది గ్రామ స్థులు తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): పాతపట్నం మండల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు, పాతపట్నం డీఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ ప్రాజెక్టు పనుల నేపథ్యంలో కొత్తచంగుడి, దశరథపురం, బైరాగిపేట తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రూ.కోటితో పట్టణంలో అభివృద్ధి పనులు

నరసన్నపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మేజర్ పంచాయతీలోని 20 వార్డులలో రూ.కోటి ఆర్థిక సంఘం నిధులతో కాలువలు, రోడ్లు పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ బి.శంకరరావు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు తెలిపారు. ఆదివారం లక్ష్మణ్ణపేట వీధిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు బోయన సతీష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు తాళాభక్తుల గోవిందరావు, లక్కోజి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

నరసన్నపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా గురుపూజోత్సవం నిర్వహించారు. భారత సనాతన ధర్మంలో భాగంగా ప్రతీ ఒక్కరూ గురువును పూజించాలని వక్తలు అన్నారు. ఆషాఢ మాసం పౌర్ణమి సందర్భంగా ఈ నెలలో గురువును తలచుకోవాలన్నారు. గురువు ఆవశ్యకతను వివరించారు. కార్య క్రమంలో ఉన్న రంగనాథ్, జీవీజీ నాయుడు, కాళ్ల శివప్రసాద్, ఆర్ఎస్ఎస్ సభ్యులు పద్మరాజు, కోరాడ రామచంద్రరావు, కేఎల్ఎన్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 9న బాలియాత్ర

జలుమూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో నవంబరు 9న నిర్వహించనున్న బాలియాత్రను విజయవంతం చేయాలని కమిటీ సభ్యుడు డా.జీవితేశ్వరరావు కోరారు. ఆదివారం శ్రీముఖలింగేశ్వరాలయం ఆవరణలో కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది కంటే ఈ ఏడాది యాత్ర ఘనంగా నిర్వహించి గొప్పదనాన్ని చాటి చెప్పాలన్నారు. బాలియాత్ర నిర్వహణకు సంబంధించి కలెక్టర్‌కు వివరించనున్నట్లు తెలిపారు. ఈ యాత్ర రాజకీయాల కతీతంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు హెచ్‌వీ దొర, ఎంపీటీసీ కరుకోల హరిప్రసాద్, డా.సంపతిరావు జగదీష్, ఫైల శ్రీనివాసరావు, అర్చకులు వెంకటాచలం, నారాయణమూర్తి, అప్పారావు, సింహాచలం, మాజీ సర్పంచ్ బసవ యోగీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన కలమట

కొత్తూరు, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి ఆదివారం మంగళగిరిలో మర్యాద పూర్వకంగా కలిశారు. జూలై రెండు నుంచి చేపడుతున్న 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమంపై రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ ముఖ్య నేతలతో సీఎం నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలమట, అనంతరం మంత్రి లోకేశ్‌ను కలిశారు.

ధర్మాన్ని అనుసరిస్తే మానవ జన్మకు సార్థకత


సత్సంగంలో పాల్గొన్న దివ్యానంద సరస్వతి స్వామి

కోటబొమ్మాళి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ధర్మమార్గాన్ని అనుసరిస్తే మానవజన్మకు సార్థ కత లభిస్తుందని, ప్రశాంతంగా బతకవచ్చని కాకినాడ గీతాశ్రమం స్వామిజీ దివ్యానంద సరస్వతి స్వామి అన్నారు. ఆదివారం ఊడికలపాడు శ్రీరామమందిరంలో శ్రీరామకృష్ణరమణ గీతాశ్రమం సభ్యుడు సనపల కరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. పర కాంతను ఆశించడం అధర్మమని, తెలిసీ సీతను అపహరించి రావణుడు తన ప్రాణాలకు ముప్పు తెచ్చుకున్నాడన్నారు. అతని సోదరుడు విభీషణుడు ధర్మాన్ని నమ్ముకుని చరితార్థుడయ్యాడన్నారు. కోటబొమ్మాళి ఆర్యసమాజం సభ్యులు గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలకు మహర్దశ

(ఐదో పేజీ తరువాయి)

నిధులతో మరో 5 పనులు పూర్తి చేశారు.

గత ప్రభుత్వంలో ఇబ్బందులు..

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి కాలువలను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. కాలువల్లో తట్టెడు మట్టికూడా తీయకపోవడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందక రైతన్నలు ఎన్నో అవస్థలు పడ్డారు. ఐదేళ్ల పాటు కాలువల నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో పాటు దట్టంగా ముళ్ల తుప్పలు పెరిగిపోయాయి. దీనివల్ల కాలువల్లో నీటి ప్రవాహం సక్రమంగా జరగక, చివరి భూములకు నీరందేది కాదు. చెక్‌డ్యాములు, ఆనకట్టలకు మరమ్మతులు చేయకపోవడంతో సాగునీరు అందక రైతులు అవస్థలు పడేవారు. రైతులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఇరిగేషన్, వంశధార అధికారులు ఏటా నిధులు కోసం ప్రతిపాదనలు చేయడం, వాటిని జగన్ సర్కారు బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో అన్నదాతులు విసిగిపోయి, శ్రమదానంతో పూడికలు తొలగించుకునే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారికి కష్టాలు తప్పాయి.

90శాతం మేర పూర్తి..

నరసన్నపేట వంశధార సబ్ డివిజన్ పరిధిలో 90 శాతం మేర పనులు పూర్తి చేశాం. కొన్ని ప్రాంతాల్లో మదుములు నిర్మించాం. శివారు ప్రాంతాలకు సాగునీరు అందే విధంగా పూడిక తీత పనులు చేపట్టాం.

-కె.రామలక్ష్మి, డీఈఈ, నరసన్నపేట

శివారు భూములకు సాగునీరు..

ఉపాధి హామీ వేతనదారుల ద్వారా వంశధార కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. చిన్నచిన్న పనులను కాంపోనెంట్ నిధులతో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది శివారు భూములకు సాగునీరు అందనుంది.

-శిమ్మ చంద్రశేఖర్, నరసన్నపేట డీసీ చైర్మన్

అలరించిన సంగీత కచేరీ


కచేరీ చేస్తున్న చిన్నా గురుస్వామి

ఇచ్ఛాపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా వెంకటేశ్వర భక్తి రంజిని చిన్నా గురుస్వామి బృందం సంగీత కచేరీ అలరించింది. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి వరకు ఆలపించిన సినీ, భక్తి పాటలు ఆకట్టుకున్నాయి. గానం వెంకటేశ్వర పట్నాయక్, కీబోర్డుపై హేమాంత్‌కుమార్, తబలాపై నిత్యానంద బాడిత్య సహకరించారు.

వంతెన పనుల పరిశీలన

వజ్రపుకొత్తూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఒంకులూరు-మెట్టూరు రాకాశి గెడ్డపై వంతెన పనులను పీఐయూ ఈఈ సనపల రామకృష్ణ ఆదివారం పరిశీలన చేశారు. ఇప్పటి వరకు జరుగుతున్న పనులపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పీఎంజీఎస్‌వై నిధులు రూ.5.65 కోట్లతో వంతెన నిర్మాణం చేపడుతున్నామని, వచ్చే ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

గాజు సీసాలో జగన్నాథ రథం



సీసాలో జగన్నాథ రథం (ఇన్‌సెట్‌లో) సింహాద్రి రాజు

టెక్కలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): టెక్కలి మెట్టవీధికి చెందిన కార్పెంటర్ సింహాద్రి రాజు గాజు సీసాలో జగన్నాథ రథాన్ని తయారు చేశారు. చెక్క వస్తువులతో దీనిని తయారుచేయగా ఆయనను పలువురు అభినందించారు. జగన్నాథ రథ యాత్ర సందర్భంగా దీనిని తయారు చేసినట్లు రాజు తెలిపారు. దీని తయారీకి సుమారు 48 గంటల పాటు అయ్యిందని, ఇలాంటివి చేయడం తన హాబీ అని అన్నారు. గతంలో కూడా గాజు సీసాలో మంచం తయారుచేశానన్నారు.

మంచికి వాడుకుందాం

(ఐదో పేజీ తరువాయి)

షేర్ చేస్తుంటారు. అయితే ఇటీవల సోషల్ మీడియాలో రాజకీయ, విధానాపరమైన పోస్టులే ఎక్కువగా దర్శనమిస్తుంటాయి. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయాలు, న్యాయపరమైన విధానాలపై వచ్చే పోస్టులను ఇతరులకు పంపడం ద్వారా చిక్కుల్లో పడుతుంటాం. అనవసరంగా పోలీసు కేసుల బారిన పడుతుంటాం. అటువంటి సమయంలో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులు సాక్ష్యాలుగా చూపు తున్నారు పోలీసులు. లేనిపోని లింకులు క్లిక్ చేయడం, పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులకు దూరంగా ఉండడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఎదుర్కొంటున్న సవాళ్లు అసభ్యపద జాలాలు. కామెంట్ల రూపంలో కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తుంటారు. కొన్నిసార్లు మనం పెట్టే పోస్టులు, షేర్లు, కామెంట్లతో న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఒక వేళ నచ్చని పోస్టు, సమాచారం ఉంటే వాటిని చూడకపోవడం, అనుసరించక పోవడమే ఉత్తమం. 'ముఖ్యంగా పిల్లలు సోషల్ మీడియాకు ఎడిక్ట్ కాకుండా చూసుకోవాలి. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకొని అనేక రకాలుగా సమాజంలో విచ్ఛిన్నకర శక్తులు ప్రవేశిస్తున్నాయి. ఇది గుర్తెరిగి ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఉండాల్సిన అవసరం ఉంది.' అని శ్రీకాకుళానికి చెందిన వైద్య నిపుణుడు కళ్యాణబాబు చెబుతున్నారు.